"ఇప్పుడు ఇంటికెళితే తులసికి ఏం చెప్పాలా అని ఆలోచిస్తున్నారు కదూ?" కవ్విస్తున్నట్లు అడిగింది.

"నటాషా, మీరు స్కూల్లో చదివేటప్పుడు జరిపిన గేమ్స్ సంగతేమిటి?"

సురేష్ నవ్వేశాడు.

"అది తులసి నా లైఫ్‌లోకి రానప్పుడు."

సురేష్ మళ్ళీ తులసి గురించి ఆలోచించాడు.

తులసి కేమని చెప్పటం... రాజ్యలక్ష్మితో గడిపానని చెప్తే... ఎలా వుంటుంది? పోని అబద్ధం చెప్తే- నో నెవర్! తామిద్దరి మధ్యా వున్నది అలాంటి బంధుత్వం కాదు.

దీప గదిలో లేనప్పుడు మొట్టమొదటిసారిగా తను తులసిని రీసెర్చ్ చేసేముందు మాట్లాడుకున్నారిద్దరూ.

"నాకో ప్రామిస్ చేస్తావా?"

"ఈ సమయంలో ఏ మగాడయినా సరే లక్ష ప్రామిస్‌లు చేస్తాడు!"

"అలాంటివి కాదు. రియల్ ప్రామిస్."

"ఏమిటది?"

"మనం ఈ బంధం ఏర్పరుచుకుంటున్నాం గనుక ఇకనుంచీ మన మధ్య ఏమీ వుండకూడదు."

"నాకూ అదే యిష్టం. బట్టలుంచుకోవటం మీనింగ్‌లెస్."

"నేననేది ఆ విషయం కాదు" అసహనంగా అందామె.

"మరి?"

"మనిద్దరి మధ్యా రహస్యాలేమి వుండకూడదంటున్నను."

"నేనయితే రీసెర్చ్‌కి ఎపుడూ రడీయే. నువ్వే అడ్డు చెపుతూంటావ్ లైట్ తీసేయమని."

"అయ్యో" చిరాకు పడిందామె "సురేష్! విల్ యూ ఎవర్ బి సీరియస్?"

"ఇలాంటి విషయాల్లో నేను చాలా సీరియస్‌గా వుంటాను. మా ఫ్రెండు ఒకడు-పేరు....పేరు ఆ! దీపక్ మొఖవాటపడ్డాడు ఆ అమ్మాయి దగ్గర. ఇప్పటికీ పశ్చాత్తాప పడుతుంటాడు."

"పాస్ట్ సంగతి వదిలేద్దాం. భవిష్యత్తులో మన మధ్య కేవలం నిజాలే వుంటాయ్. మనిద్దరి మధ్యకూ మరొకరు రాకూడదు. ముఖ్యంగా యిలాంటి వాటిల్లో."

"ఓ! అదా. ఇటీజ్ ఓ.కె."

"ఓ.కే. కాదు ప్రామిస్ చేయ్."

"ప్రామిస్"

"అలాక్కాదు. ఒకరి చేతుల్లో ఒకరు."

తను అలాగే చేశాడు "ఇలాంటి ఓత్ టేకింగ్ సెరిమనీ నేనెక్కడా చూళ్ళేదు. ఇంక రడీయేనా?"

"రడీ" అంది తులసి .

అతను లేచి నిలబడ్డాడు.

"ఏక పత్నీవ్రతులన్నమాట" హేళనగా అంది రాజ్యలక్ష్మి.

"మిగతా వ్రతాలన్నీ ముందే అయిపోయాయ్ గనుక!"

"అయితే జరిగింది మర్చిపోదాం."

"అదే మంచిదనుకుంటాను. వెళతానిక"

"ఇంత రాత్రిలోనా?"

"తులసి నా కోసం ఎదురు చూస్తుంటుంది"

"రోజూనా?"

"రోజూ వుండాల్సిందే."

ఆమె తలుపు తెరిచింది.

సురేష్ బస్టాప్‌కి  బయల్దేరాడు.

లాస్ట్ బస్ ఆగకుండా వెళ్ళిపోయిందని ఎవరో ఆర్టీసీని బూతులు తిడుతున్నారు.

"పోనీలే వూరుకోండి... తిట్టకండీ" అంటోంది వాళ్ళావిడ ఆ పక్కనే నిలబడ్డ కానిస్టేబుల్ వేపు భయంగా చూస్తూ.

నడిచి యింటికి చేరుకునేసరికి ఒంటిగంటయిపోయింది.

గంగాభవాని ఇంట్లో డిమ్‌లైట్ వెలుగుతోంది.

గేటు తీయడానికి ప్రయత్నించాడు.

లోపల తాళం...

కొంప ముంచింది!

డోర్ బెల్ మీట నొక్కాడు. లోపల టక్కున లైటు వెలిగింది. తలుపు తెరుచుకుని బయటకు తొంగి చూసింది గంగాభవాని. లైటు సురేష్ మీద పడుతోంది.

"ఎవరు?"

"నేనే!"

"నేనే అంటే..."

"సర్వే డిపార్ట్‌మెంట్."

బయటకొచ్చి తాళం తీసింది.

"ఇంత రాత్రిళ్ళు వస్తే ఎలా? పది తరువాత తాళం వేసేస్తానని చెప్పానుగా!"

"తాళంచెవి మన దగ్గరే వున్నప్పుడు భయమేముంది?"

ఆమె పెదాలమీద ముద్దు పెట్టుకోబోయినట్లు నటించాడు.

ఆమె వెనక్కు గెంతింది రెండడుగులు.

"ముట్టుకున్నారంటే మర్యాదగా వుండదు."

"ష్! గట్టిగా అరవకు, తులసి నిద్రపోయిందా?"

"ఇప్పటివరకూ గడపలో కూర్చొని యిప్పుడే పడుకుంది. ఎక్కడ తిరుగుతున్నారింత సేపూ?"

"అనుకోకుండా మా ఫ్రెండ్ ఒకమ్మాయి యింట్లో గొడవయి పోయింది."

"ఏమయింది?"

"కాంప్ కెళతానని వెళ్ళకుండా వాళ్ళాయన తిరిగి వచ్చేశాడు."

"ఇంట్లో దొరికిపోయింది నువ్వే కదూ?"

"కాదు మా ఫ్రెండ్."

"మరి ఆ లిప్‌స్టిక్ ముద్ర నీ షర్ట్ మీదెందుకు వచ్చింది?"

సురేష్ అదిరిపడ్డాడు. అవును-షర్ట్ మీద స్పష్టంగా కనబడుతున్నాయి పెదాలు-మగాడి సుఖశాంతుల్ని సర్వనాశనం చేసే గుర్తుల్లో రెండవది. మొదటిది కుంకం లేక తిలకం. రాజ్యలక్ష్మి- టు హెల్ విత్ యూ.....

"నేనే మా ఫ్రెండనుకుని ఆ అమ్మాయి."

"నేనిచ్చిన యాభయ్ రూపాయలు దీనికోసమా!"

"నో ప్లీజ్! అలా అభాండాలు వేయకండి. నిజం చెపుతున్నాను. నేను మీ కెప్పుడూ ద్రోహం చేసి యింకో అమ్మాయి దగ్గరకెళ్ళను."

"నాకు ద్రోహమేమిటి? మీరెక్కడికెళితే నాకెందుకు?"

"థాంక్ యూ! అందరు అమ్మాయిలూ మీలాగా అనుకుంటే దేశం సుఖ శాంతులతో కళకళలాడిపోతుంది"

ఆమె లోపలకు వెళ్ళి తలుపు వేయబోయింది.

అడ్డుపడి తనూ లోపలికొచ్చాడతను.

"లోపలికెందుకొస్తున్నారు?"

"అబ్బా! యుగయుగాలుగా మగాడికీ ప్రశ్న తప్పటం లేదు. దీనికి సమాధానం లేదు" ఆమెను చటుక్కున దగ్గరకు లాక్కుని పెదాలమీద ముద్దు పెట్టుకున్నాడు.

ఆమె విడిపించుకుని చెంపమీద కొట్టింది గానీ చెంపను తాకే సమయానికి చేతిలో విసురు

తొంభై శాతం తగ్గిపోయింది.

"ముందిక్కడనుంచి వెళతారా లేదా?"

"ఒక సహాయం చేస్తే...."

"ఏమిటది?"

"మీ ఆయన షర్టు కావాలి."

గంగాభవానికి అర్థం కావటం లేదు.

"అలా చూడకండి మీ ఆయన వాడిన షర్ట్స్ ఏమీ లేవా? ఏదోటి ఎంత పాతదయినా సరే...."

"ఎందుకు?"

"షర్టు మీద లిప్‌స్టిక్ తులసి చూసిందంటే అపార్థాలు, అపోహలు, అనుమానాలు తలెత్తుతాయి."

"ఇందులో అపోహ ఏముంది?"

"అది మనిద్దరం రేపు మధ్యాహ్నం తేల్చుకుందాం..... తులసి ఆఫీస్ కెళ్ళాక...ఈలోగా ఒక షర్ట్ అర్జంట్"

"ఇంత సిగ్గు లేనివాళ్లను నేనెక్కడా చూళ్ళేదు"

"నేనూ చూళ్ళేదు."

ఆమె నవ్వాపుకుని లోపల గదిలోకెళ్ళి బాగా నలిగిపోయిన షర్ట్ తెచ్చిచ్చింది.

"మళ్ళీ నాకిచ్చేయాలిది. గుర్తుగా దాచుకున్నాను."

"పోనీ దాని బదులు నేను గుర్తు చేస్తుంటాను"

"ఏం అక్కర్లేదు" కోపంగా అంది-"లోపల గదిలోకెళ్ళి షర్ట్ మార్చుకోండి"

సురేష్ లోపల గదిలోకెళ్ళి షర్ట్ మార్చుకుని తిరిగి వచ్చాడు.

"థాంక్యూ గంగాభవాని....మీ ఋణం వుంచుకోను..అప్పుడప్పుడూ కాయకష్టం చేసి తీర్చుకుంటా..." అతని మాట ఆగిపోయింది.

ఎదురుగ్గా కుర్చీలో కూర్చుని తనవంకే చూస్తోంది తులసి !!

పెదాల మీద చిరునవ్వు తెచ్చి పెట్టుకోడానికి సురేష్ ప్రయత్నించాడుగాని వుపయోగం లేకపోయింది.

"ఓ నువ్వింకా నిద్రపోలేదా?" అతి కష్టం మీద కూడదీసుకుని అన్నాడు సురేష్ .

తులసి మాట్లాడలేదు. వెనక్కు తిరిగి తమ ఇంటి వైపు నడిచింది. తనూ వెనుకే బయల్దేరబోయాడు సురేష్ . గడపవరకూ వెళ్ళాక గుర్తుకొచ్చించి తులసిని గంగాభవానే పిలుచుకొచ్చి వుంటుందన్న విషయం. వెనక్కు తిరిగి గంగాభవాని వైపు చూశాడు.